జనరల్ స్టడీస్

## ప్రపంచ సంక్షోభాలు ఐక్యరాజ్య సమితి పాత్ర

# సమితిలో సంస్కరణలు అత్యవసరం



ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

ప్రపంచ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ఐక్యరాజ్య సమితి సంస్కరణలు చేపట్టాలని భారత ప్రధాని ఇటీవల ఐరాస జనరల్ అసెంబ్లీలో ప్రసంగిస్తూ అన్నారు. కొంతకాలం క్రితం వరకు ప్రపంచీకరణ, పరస్పర ఆధారిత ప్రపంచ ప్రయోజనాలు వాటంతట అవే వస్తాయని ప్రపంచం భావించింది. కానీ, ఈ పరిణామాలకు సంబంధించిన ప్రతికూల ఫలితాలను వివిధ దేశాలు, ఖండాలు అనుభవించడం ప్రారంభమైంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరమైన ప్రతికూల పరిణామాలున్నాయి. ప్రస్తుతం మనం ఈ ప్రతికూల పరిణామాలను ఎదుర్కోవడంపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకే బలమైన, శక్తివంతమైన ఐక్యరాజ్య సమితి అవసరం ఏర్పడింది. ఇది జరగాలంటే ఐక్యరాజ్య సమితి ప్రధాన అంగాలైన జనరల్ అసెంబ్లీ, భద్రతా మండలిని పునరుజ్జీవింపజేయాలి, సంస్కరించాలి'- భారత ప్రధాని మన్మోహన్‌సింగ్ ఐరాస జనరల్ అసెంబ్లీని ఉద్దేశించి అన్న మాటలివి. 2008లో ఆర్థిక మాంద్యం ఒక్కసారిగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేసింది. ఈ ఆర్థిక సంక్షోభం, ద్రవ్య సంక్షోభాల నుంచి బయటపడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు... పుష్పించినప్పటికీ ఇంకా ఫలించలేదు. ఎన్ని ఉద్దీపన ప్యాకేజీలను అమలు చేసినప్పటికీ ఇవి సంక్షోభానికి మూలమైన సమస్యలను పరిష్కరించలేకపోయాయి. దీనివల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ సంక్షోభం నుంచి బయటపడలేకపోతోంది.

### రెండో ఆర్థిక మాంద్యం దిశగా ప్రపంచం

అనేక విషయాల్లో ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చింది. రెండో ఆర్థిక మాంద్యం దిశగా ప్రపంచం పయనిస్తోందని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. అమెరికా రుణ సంక్షోభం, యూరోజోన్‌లో సంక్షోభం, అమెరికా, జపాన్ లాంటి దేశాల్లో పెరుగుతున్న రుణభారం, బ్రిటన్ లాంటి దేశాల్లో పెరుగుతున్న బడ్జెట్ కోతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెనుసవాళ్లుగా మారుతూనే ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లోనే ఏర్పడుతున్న ఈ పరిణామాలు ప్రపంచ ద్రవ్య, పెట్టుబడి మార్కెట్లలో తీవ్ర అనిశ్చితికి కారణమవుతున్నాయి. ఇప్పటికే ద్రవ్యోల్బణం సమస్యను ఎదుర్కొంటున్న అభివృద్ధి చెందుతున్న దేశాలు, అభివృద్ధి చెందిన ప్రపంచంలో వస్తున్న ప్రతికూల పరిణామాలను కూడా ఎదుర్కోక తప్పదు. ఇందుకు కారణం అభివృద్ధి చెందిన ప్రపంచంలో ఏర్పడిన మాంద్యం, మందకొడితనం విశ్వవ్యాప్త డిమాండ్‌ను దెబ్బ తీస్తోంది. పెట్టుబడుల ప్రవాహాన్ని ఆటంక పరుస్తోంది. ఈ మందకొడితనం కొనసాగే కొద్దీ అభివృద్ధి చెందిన దేశాలు మరింత రక్షణాత్మక ఆర్థిక విధానాలను అనుసరిస్తాయి. ఇది ఆర్థిక సంక్షోభాన్ని మరింత పెంచుతుంది. ఇది ఒక వలయంగా మారి సమస్యను జటిలం చేస్తోంది. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి లాంటి సంస్థలు ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో విజయాన్ని సాధించలేకపోతున్నాయి. వాస్తవానికి అంతర్జాతీయ ద్రవ్యనిధి లాంటి సంస్థల్లో ఇటీవల సంస్కరణలను చేపట్టినప్పటికీ ఇవి ఇప్పటికీ ధనంపై పశ్చిమ దేశాల ఆధిపత్యానికి చిహ్నంగానే ఉన్నాయి. అందుకే తిరిగి అంతర్జాతీయ ఆర్థిక ద్రవ్య వ్యవస్థల నిర్వహణలో ఐక్యరాజ్య సమితి ప్రధాన పాత్ర పోషించాలి.

ఐక్యరాజ్య సమితి ప్రధాన ఎజెండాలోకి అభివృద్ధిని మళ్లీ తీసుకురావాలి. ఐక్యరాజ్య సమితిని పటిష్ఠం చేయాలంటే తేవాల్సిన ముఖ్యమైన మార్పు ఇది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సంప్రదాయికంగా బలాన్ని చేకూర్చి, ప్రపంచ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థలకు స్థిరత్వాన్ని ఇచ్చిన అమెరికా, యూరప్, జపాన్‌లలో వృద్ధిరేటు ఇంకా మందకొడిగానే సాగుతోంది. దీనికితోడు పశ్చిమాసియా, ఉత్తరాఫ్రికాల్లో అనూహ్య స్థాయిలో సామాజిక, రాజకీయ పరిణామాలు సంభవిస్తున్నాయి. ఆహార, ఇంధన ధరలు తీవ్ర స్థాయిలో పెరుగుతున్నాయి. ఇది మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితిని తీసుకువచ్చింది. ఈ కొత్త సవాళ్లు ఐక్యరాజ్య సమితి ప్రాధాన్యాన్ని పెంచాయి. శాంతి, సుస్థిరత, అభివృద్ధి లక్ష్యాలతో ఐరాస ఏర్పడింది. ఈ లక్ష్యాలకు సరికొత్తగా సవాళ్లు ఎదురవుతున్నాయి.

### అంతర్జాతీయ సవాలుగా తీవ్రవాదం

వీటికి తోడు చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న పాలస్తీనా సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. మరో వైపు తీవ్రవాదం అంతర్జాతీయ సవాల్‌గా మారింది. ఇటీవల వస్తున్న వార్తలు అణు తీవ్రవాద భయాన్ని పెంచుతున్నాయి. అతి ప్రమాదకర విధ్వంసక ఆయుధాలు తీవ్రవాదుల చేతుల్లోకి వెళితే ప్రపంచ మనుగడే ప్రమాదంలో పడుతుంది. పాకిస్థాన్ లాంటి దేశంలో రాజ్యేతర శక్తులు రాజ్య వ్యవస్థలోకి ప్రవేశించాయి. ఇప్పటికీ అంతర్జాతీయ తీవ్రవాదంపై ఐక్యరాజ్య సమతి నేతృత్వంలో నిజమైన పోరు జరగడంలేదు. అభివృద్ధిలో అసమానతలు, ఉపాధి అవకాశాల్లో సమస్యలు, వివిధ దేశాల్లో స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాల హరింపు వివిధ రకాల ఉన్మాద భావాలు ప్రజ్వరిల్లడం లాంటి అనేక సమస్యలు ప్రపంచాన్ని వేధిస్తున్నాయి. సముద్ర రవాణా భద్రత కూడా సమస్యగా మారుతోంది. ఇలాంటి అనేక సవాళ్లను ఎదుర్కోవడానికి సమన్వయంతో కూడిన అంతర్జాతీయ కృషి అవసరం. దీనికి ఐక్యరాజ్య సమితే వేదిక కావాలి.

ఇక ఐక్యరాజ్య సమతికి మరో ప్రధాన ప్రాతిపదిక దేశాల సార్వభౌమాధికారం. వివిధ దేశాల్లో ఏర్పడుతున్న రాజకీయ ఘర్షణలను పరిష్కరించుకునేందుకు ఆయా దేశాల ప్రజలకు అవకాశం ఇవ్వకుండా అగ్రరాజ్యాలు బలప్రయోగానికి దిగుతున్నాయి. మానవతాపూర్యక జోక్యం పేరిట సార్వభౌమాధికారాన్నే ప్రశ్నిస్తున్నాయి. ఇందులో అగ్రరాజ్యాలు వివక్షతో కూడిన వైఖరిని అవలంభిస్తున్నాయి. ప్రపంచంలోని వివిధ దేశాల్లో వ్యక్తమయ్యే స్వేచ్ఛా, ప్రజాస్వామిక ఆకాంక్షల పట్ల స్పందించే విషయంలో కూడా అగ్రరాజ్యాల వైఖరి పూర్తిగా ఏకపక్షంగా ఉంటోంది. అందుకే తీవ్రవాదం లాంటి అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడంలో ఐక్యరాజ్య సమితి నాయకత్వ పాత్ర వహించాలని బ్రిక్స్ శిఖరాగ్ర సభ అభిప్రాయపడింది. అంతర్జాతీయ వివాదాల పరిష్కారంలో బల ప్రయోగాన్ని తాము అంగీకరించమని బ్రిక్స్ తుది ప్రకటనలో బ్రెజిల్, రష్యా, భారత్, చైనాలు ప్రకటించాయి. ఏ సమస్యకైనా బయటి నుంచి పరిష్కారం చూపాలని ఆలోచించడంగానీ, ప్రయత్నించడంలోగానీ ప్రమాదం ఉందని ఐక్యరాజ్య సమితిలో ప్రసంగిస్తూ భారత ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచంలో ఏర్పడే సమస్యలకు ప్రపంచ స్పందన న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా ఉంటేనే దానికి విజయం సాధ్యమవుతుందని ప్రధాని పేర్కొన్న విషయం గమనార్హం. ఏ సమస్యకైనా పరిష్కారం అంతర్జాతీయ చట్టాలకు లోబడి ఉండాలి.



### మారిన ప్రపంచ స్థితిగతులు

ఐక్యరాజ్య సమితి ఏర్పడినప్పటి ప్రపంచానికి, ప్రస్తుత ప్రపంచానికి గణనీయమైన తేడా ఉంది. ఐక్యరాజ్య సమితి ఏర్పడిన నాటికి అత్యధిక ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు వలస వాదంలోనే మగ్గుతుండేవి. ఆరున్నర దశాబ్దాల అనంతరం కూడా ఆఫ్రికా, లాటిన్ అమెరికాలకు ఐక్యరాజ్య సమతి భద్రతామండలి శాశ్వత సభ్య దేశాల్లో ప్రాతినిధ్యం లేదు. ఆసియాకు న్యాయమైన ప్రాతినిధ్యం లేదు. రాజకీయంగా, ఆర్థికంగా ప్రాబల్యంకోల్పోయిన యూరప్‌కు భద్రతామండలిలో అధిక ప్రాతినిధ్యం ఉంది. టెన్నీసన్ అన్నట్లు 'ఐక్యరాజ్య సమితి దేశాల పార్లమెంట్, మానవుల సమాఖ్య.' కానీ గతంలో ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరలే అన్నట్లు ప్రపంచ ప్రజలకు ప్రాతినిధ్యం వహించకుండా ఐక్యరాజ్య సమితి తీసుకునే నిర్ణయాలు ప్రపంచ ప్రజలపై నిర్ణయాత్మక ప్రభావాన్ని చూపలేవు.

అందుకే ఆసియా ఖండంలో అధిక జనాభా ఉన్న భారత్, లాటిన్ అమెరికాలోని బ్రెజిల్, ఆఫ్రికాలోని నైజీరియా లేదా దక్షిణాఫ్రికా లాంటి దేశాల్లో ఏదైనా ఒకటి లేదా రెండు దేశాలకు ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలనే ప్రతిపాదన బలంగా వినిపిస్తోంది. అయితే పశ్చిమ దేశాలు జర్మనీ, ఫ్రాన్స్‌లకు శాశ్వత సభ్యత్వాన్ని ఇవ్వాలనే అంశానికి ఎక్కువగా సుముఖంగా ఉన్నాయి. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఈ రెండు దేశాలు బలమైన దేశాలుగా అవిర్భవించాయి. ఈ కారణం వల్ల జర్మనీ, జపాన్‌లకు శాశ్వత సభ్యత్వాన్ని ఇవ్వడానికి ఎవరికీ వ్యతిరేకత లేదు. అయితే ఈ రెండు దేశాల ఎంపికకు మరో కారణం కూడా కనిపిస్తోంది. ఐక్యరాజ్య సమితి బడ్జెట్‌కు ఈ రెండు దేశాలు ప్రధాన తోడ్పాటునిస్తున్నాయి. కాబట్టి వీటికి శాశ్వత సభ్యత్వ హోదా ఇవ్వాలనే ప్రతిపాదన కూడా ఉంది. దీనికి భారత్ సహా అనేక దేశాలు అభ్యంతరం చెబుతున్నాయి. ఐక్యరాజ్య సమితి అనేది బ్యాంక్ లేదా మరే ఇతర ద్రవ్య సంస్థ కాదు. ఇదొక రాజకీయ వ్యవస్థ. అలాంటప్పుడు పెడుతున్న వ్యయాన్ని బట్టి హోదానిస్తే ప్రమాదకర సంప్రదాయాన్ని నెలకొల్పినట్లవుతుంది. ఐక్యరాజ్య సమితి ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుందనేది నిజం. దీన్ని పరిష్కరించుకునేందుకు ప్రత్యామ్నాయాలు ఆలోచించాలి తప్ప ఈ కారణంతో సమితి ఉనికికే ప్రమాదం తేకూడదు. ఐక్యరాజ్య సమితి ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులకు కూడా నిర్దిష్ట సూచనలు వస్తున్నాయి. ఇందులో ముఖ్యమైనవి:

ప్రతి దేశం తన జాతీయాదాయంలో కొంత భాగాన్ని తప్పనిసరిగా ఐక్యరాజ్య సమితి బడ్జెట్‌కు కేటాయించాలనే నిబంధన ఉండాలి. ఇక రెండో సూచన చేసింది నోబెల్ బహుమతి గ్రహీత జేమ్స్ టోబిన్. అంతర్జాతీయంగా పెట్టుబడుల ప్రవాహం తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతోంది. ఈ హెచ్చుతగ్గులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితిని తీసుకొస్తున్నాయి. ఈ పెట్టుబడులపై పన్ను వేసి అలా వచ్చిన నిధులను ఐక్యరాజ్య సమితి బడ్జెట్‌కు నివేదించాలనేదే ఈయన ప్రతిపాదన. దీన్ని 'టోబిన్ టాక్స్' అని కూడా అంటారు.

### ఇస్లామిక్ దేశానికి భద్రాతామండలి సభ్యత్వం!

సమకాలీన ప్రపంచంలోని పరిస్థితుల దృష్ట్యా ఇస్లామిక్ దేశాల్లో కీలకమైన దేశానికి కూడా భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది. అయితే మతం ప్రాతిపదికపై అంతర్జాతీయ సంబంధాలను నిర్ధరించలేమని చాలా దేశాలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాయి. ఇలాంటి అంతగా ప్రాధాన్యంలేని ప్రతిపాదనలు చాలా వచ్చాయి. ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక బలగాలకు తోడ్పాటునిచ్చిన దేశానికి ఈ హోదానివ్వాలి. దీనికి మనదేశానికి ఎలాంటి వ్యతిరేకతా లేదు. శాంతి పరిరక్షక కృషిలో భాగంగా భారత్ ఐక్యరాజ్య సమితికి ఇతోధికంగా బలగాలను అందిస్తోంది. కానీ, ఇందులో కూడా చిక్కు ఉంది. చైనా, జర్మనీ లాంటి దేశాలు ఇలాంటి కృషిలో అంత చురుగ్గా ఉండటం లేదు. ఐక్యరాజ్య సమితి తీర్మానాలకు అమలు ప్రాతిపదిక ఉండాలని పాకిస్థాన్ ప్రతిపాదించింది. ఇది కేవలం భారతదేశ అవకాశాలను దెబ్బతీసే ఎత్తుగడ తప్ప ప్రయోజనం లేని ప్రతిపాదన. వాస్తవానికి ఈ నిబంధన ఉంటే సభ్యత్వ హోదాను కోల్పోయే తొలి దేశం అమెరికాయే. ఐక్యరాజ్య సమితి చేసిన అత్యధిక తీర్మానాలు అమెరికాకు సంబంధించినవే ఉంటాయి. అత్యధికంగా తీర్మానాలను ఉల్లంఘించిన దేశం కూడా సాధారణంగా అమెరికానే. ఇలా భిన్నమైన ప్రాతిపదికల నడుమ ఎలాంటి ఏకాభిప్రాయం ఇంకా కుదరడం లేదు.

### వీటో భవితవ్యంపై సందేహాలు

తేలాల్సిన మరో ముఖ్యాంశం వీటో అధికారం. ప్రస్తుతం ఐక్యరాజ్య సమితి శాశ్వత సభ్యదేశాలకు వీటో అధికారం ఉంది. వీటో భవితవ్యంపై మూడు రకాల ప్రత్యామ్నాయాలు వినిపిస్తున్నాయి. ఇందులో మొదటిది కొత్తగా భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం పొందిన దేశాలకు కూడా వీటో అధికారం ఇవ్వాలి. ఇందుకు ప్రస్తుత శాశ్వత సభ్యదేశాలు అంగీకరించడం లేదు. రెండోది ప్రస్తుత సభ్యదేశాలు కూడా శాశ్వత సభ్యత్వ హోదాను వదులుకోవాలి. ఇందుకు కూడా ఆ దేశాలు సిద్ధంగా లేవు. అంటే ప్రస్తుతం భద్రతామండలిలో శాశ్వత సభ్య దేశాలుగా ఉన్న దేశాలు తమకున్న వీటో అధికారాన్ని వదులుకోదలచుకోలేదు, ఇతరులతో పంచుకోదలచుకోలేదు. ఇక మూడోది ప్రస్తుతం ఉన్న వాటికి వీటో అధికారం కొనసాగించి, కొత్తవాటికి వీటో అధికారం ఉండకుండా నిబంధన చేయాలనే ప్రతిపాదన. ఇందుకు శాశ్వత సభ్యత్వం కోరుతున్న భారత్ లాంటి దేశాలు విముఖంగా ఉన్నాయి. ఈ చిక్కుముడిని విప్పడానికి భారత్ కొత్త ప్రతిపాదనతో ముందుకొచ్చింది. దీని ప్రకారం కొత్తగా శాశ్వత సభ్యత్వం కోరుతున్న దేశాలకు కూడా వీటో అధికారం ఉంటుంది. కానీ, ఈ అధికారాన్ని ఉపయోగించడంపై మారటోరియం ఉంటుంది. దీన్ని 15 ఏళ్ల తర్వాత సమీక్షిస్తారు. ఈ భిన్న ప్రతిపాదనలపై ప్రపంచంలోని కీలక దేశాల మధ్య ఏకాభిప్రాయం రావాలి. వీటిని గమనించే అమెరికా అధ్యక్షుడు భారత అభ్యర్థిత్వానికి మద్దతు పలుకుతూ ... రాబోయే సంవత్సరాల్లో సంస్కరించనున్న ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్య దేశంగా భారత్‌ను చూడాలనుకుంటున్నామని వ్యాఖ్యానించారు.

ఐక్యరాజ్య సమితి సంస్కరణల ఆవశ్యకతపై దాదాపు ఏకాభిప్రాయం ఉంది. కానీ, ఈ సంస్కరణల రూపురేఖలు ఎలా ఉండాలన్న దానిపై మాత్రం ఇంకా ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో ఐక్యరాజ్య సమితి శక్తివంతమైన పాత్రను పోషించాలంటే సంస్కరణలు అత్యవసరం.

(రచయిత జర్నలిజం అధ్యాపకులు, కాలమిస్టు)